# నేను తల్లినౌతాను

"ఎంతకు తెగించావే. అలా చెప్పడానికి నీకు నోరెలా వచ్చిందే. మా పరువు గంగలో కలిపావు. ఈ యింటికి శనిలా దాపురించావు. పుట్టగానే చచ్చినా ఒక ఏడుపు ఏడిచి వూరుకుందుము"– గోదావరమ్మ వంట గదిలోంచే పెద్దనోరు వేసుకుని అరుస్తోంది.

గత నాలుగయిదు నెలలుగా రగులుతున్న అగ్నిపర్వతం ఇవ్వాళ పగిలింది. ఇంద్రాణి నెలతప్పింది. ఆ మాట తల్లికి ధైర్యంగా చెప్పింది.

ఇంద్రాణి అందరికంటే పెద్దది. తరువాత కళ్యాణి. చివరి పిల్ల రాగిణి. ముగ్గురాడపిల్లల తరువాత ఒక మగపిల్లవాడు రఘురాం.

తండ్రి జోగారావు ఎన్‌జీవో. గుమాస్తాగా సర్వీసు ప్రారంభించి ఏళ్ల తరబడి క్యూలో నిలబడి చివరికి ఆఫీసు సూపర్నెంటయ్యాడు. తొలి సంతానం ఇంద్రాణి పుట్టడం చాలా కష్టమయ్యింది. పుట్టేక, పుట్టిన బిడ్డ బ్రతుకుతుందో లేదోనని ఆందోళన కొంత. నెలతక్కువ కాన్పు. గోదావరమ్మకి చచ్చి బ్రతికినంత ఖాయిలా చేసింది. ఎక్కడ లేని సొమ్ము ఖర్చయింది. బిడ్డకి మెల్లకన్ను. తల్లిదండ్రులు చాలా నొచ్చుకున్నారు. ఏడాది నిండి రెండో ఏడు జొరబడేసరికి పోలియో వచ్చింది. ఎడమ కాలు తిన్నగా నిలబెట్టలేదు బిడ్డ. ఆ పోలియో బాగుచేయించడానిక్కూడా ఎంత డబ్బు ఖర్చయ్యిందో అయ్యింది. చివరికి ప్రాణం విసిగి ఊరుకున్నారు. ఇంతలో పుట్టింది కళ్యాణి. ఆ పిల్ల ఆశ్చర్యకరంగా నల్లగా పుట్టింది. మూడో సంతానం మొగపిల్లడు పుట్టాలని వెయ్యిదేముళ్లకు మొక్కుకున్నా. రాగిణి పుట్టింది. ఎర్రగా దబ్బపండులా వుంటుంది. చిదిమిదీపం పెట్టవచ్చు. నోరు విప్పి మాట్లాడితే రాగాలే పలుకుతాయి. అంత చక్కని కంఠస్వరం.

నాలుగో సంతానం మగపిల్లడు పుట్టేడు.

ఆ రోజు ఆ యింట్లో ఎంత కోలాహలమో చెప్పలేం. బారసాల ఎంత ఘనంగా చేశారో, అందరి మొహాల్లోనూ ఎంత సంతోషమో వర్ణించనలవి కాదు. అప్పటికి ఇంద్రాణికి పదేళ్లు. అమాయకమూ. అజ్ఞానమూ తెలిసీ తెలియని వయసు. అందరితో పాటూ తనూ హడావిడిగా తిరిగింది. చెల్లెళ్లు పుట్టినప్పుడు లేని ఈ హడావిడి తమ్ముడు పుట్టినప్పుడెందుకో బోధపడలేదు. భద్రాచలం వెళ్ళి తలనీలాలిచ్చి వచ్చి రఘురాముడని పేరు పెట్టుకున్నారు.

ఇంద్రాణిని విసుక్కోని రోజు లేదు. శాపనార్థాలు పెట్టని రోజు లేదు. పదో తరగతిలో లెక్కల్లోనూ. ఇంగ్లీషులోనూ తప్పింది. దాంతో చదువు మాన్పించేశారు. నానా పాట్లూ పడి నాలుగయిదు సార్లు తప్పి చివరికి పదవ తరగతి పాసయింది. ఇంటర్ మీడియట్ చదువుకుంటానంటే–

"ఎలాగో ఓలా ఏకుంటాడికో గుడ్డాడికోయిచ్చి నీ భారం వదిలించుకోవాలని మేం చూస్తుంటే ఇంకా చదువులు దేనికి? పాసయి వూళ్లేలుతావా వుద్యోగాలు చేస్తావా? చాల్చాలు. నోర్మూసుకు పడుండు" అని తిట్టిపోసింది గోదావరమ్మ.

తలతాకట్టు పెట్టయినా అడిగిన కట్నం యివ్వడానికి సిద్ధపడ్డాడు జోగారావు. ఇంద్రాణిని చూసుకోవడానికి వచ్చిన వాళ్లంతా కళ్యాణికి చేసుకుంటామనే వారు. చివరికి అదనే అయ్యింది. ఇంద్రాణికి పెళ్ళి కాకుండానే కళ్యాణికి పెళ్లయిపోయింది. అప్పటికి ఇంద్రాణికి ఇరవై నాలుగేళ్ళు.

మూడు నెలలయింది. రాగిణికి కూడా పెళ్ళయి వెళ్ళిపోయింది. రఘురాం ఇంటర్ పాసయి డిగ్రీలో జాయినయాడు.

ఇంద్రాణి మహిళా సంఘం వారి కుట్టు సెంటర్లో ట్రయినింగుకు వెళ్తున్నది. దీనికి మొదట ఇంట్లో ఒప్పుకోలేదు. కాని ఒక జీవనోపాధి కల్పించాలి కదా అని ఒప్పుకున్నారు. కుట్టుసెంటర్ కు వస్తుంటుంది. కుట్టుసెంటర్‌కు వెళ్లేదారిలో టైప్ ఇన్‌స్టిట్యూవుంది. అక్కడో అబ్బాయితో పరిచయమైంది. డిగ్రీతప్పి టైపు నేర్చుకుంటున్నాడు. ఇంద్రాణికంటె రెండేళ్లు చిన్న(ట). అతని చెల్లెలు కూడా కుట్టు సెంటర్‌కి వస్తుంటుంది. ఆమెతో రావడం.... ఆమెతో రావడం వల్లా, అదే దారి కావడం వల్లా ఇద్దరికీ పరిచయమయింది. ఆ పరిచయం ఆ వయసులో వుండే శారీరక అవసరాల దృష్ట్యా మరింత ముందుకు వెళ్లింది. ఇద్దరూ మరింత సన్నిహిత మయ్యారు. అతనితో మాట్లాడుతున్న కాస్సేపూ ఇంద్రాణికి మనసంతా కంగారుగా వుండేది. మళ్ళీ ఆనందంగా కూడా వుండేది.

అప్పుడప్పుడు కుట్టు సెంటర్‌కి శాంతి అని ఒకామె వస్తూ వుంటుంది. ఆమె మహిళా సంఘాల్లో చాలా చురుగ్గా పనిచేస్తుంటుంది. బాగా చదువుతుంటుంది. తాను చదివి నేర్చిన సంగతులు మిగతా ఆడవాళ్లకు చెబుతుంటుంది. మొదట్లో ఆమె మాటలు వింటుంటే భయంగా వుండేది. నిజమే సుమా అనిపించేది. పురుషాధిక్యతను వ్యతిరేకించాలనీ, పురుషుల స్వార్థంపై తిరుగుబాటు చెయ్యాలనీ చెప్పినప్పుడు భయంగా వుండేది. ఆడవాళ్లని మగవాళ్లు ఎంతగా అన్యాయం చేస్తున్నారో చెప్పినపుడు నిజమే అనిపిస్తుంది. మరి తనకు తల్లీ తండ్రీ చెయ్యలేదా? తనకీ కోరికలు వుంటాయని అవి తీర్చుకోవాలని తను తహతహలాడుతుందనీ ఈ లోకం ఎందుకు గుర్తించదు? అంగీకరించదు? ఇంద్రాణికి ఇటీవల ఈ లోకం చాలా క్రూరంగానూ, చాలా వింతగానూ కనపడుతుంది.

శాంతి మాటలువింటుంటే ఈ ప్రపంచ స్వభావం కాస్త కాస్త అర్థమవుతున్నది. అగ్రవర్గాలకి, వర్ణాలకి పాలకులకు సామాన్య మానవులంతా ఒక విధంగా బానిసలే. అందులో మళ్లీ స్త్రీలు పురుషులకి బానిసలు. ఆ స్త్రీలల్లో అంగవైకల్యం వంటి లోపాలుంటే మరింత లోకువ, చులకన. అంటే తన బ్రతుకు బానిసకొక బానిసకొక బానిసఅనమాట!

తాను నిస్సందేహంగా చైతన్యం తెచ్చుకోవాలి.

ఇలా ఆలోచిస్తూ చాలా ఉత్తేజం పొందుతుంటుంది ఇంద్రాణి.

"ఎల్లుండి నీపుట్టినరోజు కదూ. మర్చేపోయేనమ్మా" అన్నాడు జోగారావు. వెంటనే కూతురి వయసు గుర్తొచ్చింది. ఎల్లుండితో ఇరవై ఎనిమిదేళ్ళు నిండిపోతాయి. అతని గుండె బరువెక్కిపోయింది.

"రోజూ కుట్టు సెంటర్‌కి వెళ్తున్నాను కదూ. అప్పుడప్పుడు బట్టలు కుడితే వచ్చిన డబ్బులు నా దగ్గర వంద రూపాయల వరకూ దాచుకున్నాను నాన్నా. చీర కొనుక్కో వద్దూ?"

జోగారావుకు కడుపుతరుక్కుపోయింది. మొదటి నుంచీ పెద్ద కూతుర్ని తాను అశ్రద్ధ చేశాడు. ఇంత వయసొచ్చే వరకూ పెళ్ళి చెయ్యలేకపోయేడు. ఇక చెయ్యలేడేమో. అదలా వుంచితే ఆమెను తాను ఆదరంగా చూడటం లేదు. ఇంట్లో వచ్చే అన్ని కష్టాలకూ ఆమె కారణమని నిందించడం ఏం ధర్మం? ఆమె అలా అంగవైకల్యంతో పుట్టడానికి ఎవరు కారణం? తాను గాని తన భార్య గాని కారణమా? కాదు. పోనీ కూతురుది తప్పా? కాదు..

"ఏమిటాలోచిస్తున్నావు నాన్నా. పోన్లే నువ్వు వద్దంటే మానేస్తాను. ఇంటి ఖర్చులకు ఉపయోగించమని అమ్మకిచ్చేస్తాను."

"వద్దమ్మా వద్దు. నీ దగ్గిరే వుంచుకో తల్లీ. అది నువ్వు సంపాయించుకున్న డబ్బు ఇంకో వంద రూపాయలిస్తాను. రేపు కేంపు వెళ్లే ముందు జ్ఞాపకం చెయ్యి ఇస్తాను."

నాన్నేమో మరో వంద కూడా ఇస్తావంటున్నారు. చీరకొనుక్కుందుకు. అమ్మకు తెలిస్తే సాధించి పోస్తుంది. తను చెప్పదు. ఏదో కల్పించి అబద్ధం చెప్పేస్తుంది. ఇలా ఆలోచించే సరికి ఇంద్రాణి మనసు ఊరట పడింది.

పెరట్లోకి వెళ్ళి వాంతి చేసుకుని వచ్చింది ఇంద్రాణి. నీరసంగా ఓ మూల కూచుంది. ఇంతలో తల్లి రానే వచ్చింది.

'ఏమే. అలా కూచున్నావు. శుక్రవారం పొద్దు. ఆడపిల్లవు, అలాగేనా? అసలుసంజవేళ చీకట్లో కూచోవడం. ఏం పట్టుకుందే నీకు.'

'అబ్బ. ఎందుకమ్మా అన్నిటికీ తిడతావూ. తలనెప్పిగా వుంటేనూ?.

'తలనెప్పి నాకు లేదూ. తలనెప్పి, వొళ్ళు నెప్పులూ నాకూ వున్నాయి. తప్పుతుందీ? లేచి మొహాన ఇంత బొట్టు పెట్టుకుని ఇలా వెలుగులో కూచో.'

శాంతి బొట్టు, గాజులూ, మంగళ సూత్రం, మట్టెలు వీటి అర్థం కూడా చెప్పింది. బొట్టు ఒక రకంగా ఋతుస్రావానికీ, సంతానవతి అయ్యే అర్హతకీ చిహ్నాలట. భర్తపోతే సంతానం పొందే అర్హతలేదు. కాబట్టి బొట్టు వుండకూడదు. గాజులు సంకెళ్ళట. మంగళసూత్రం మెడలో ఉచ్చు! కాళ్లకి గొలుసులూ, కడియాలూ, మట్టెలూ కూడా బంధాలే. ఎంత బాగా వివరించింది. బంధాలన్నీ క్రమంగా అలంకారాలుగా, ఆచారాలుగా సంప్రదాయాలుగా, తప్పక పాటించవలసిన కట్టు బాట్లుగా తయారు చేశారు. గత ఆరు నెలలుగా తరచుగా పుస్తకాలు చదువుతున్నది. అన్నీ శాంతి యిచ్చినవే. ఇంద్రాణికి ప్రపంచం కొత్తగా కనిపిస్తున్నట్టున్నది. లోగడ తెలియని ఎన్నో విషయాలు అర్థమై ఆశ్చర్యంగానూ, ఆగ్రహంగానూ వుంటున్నది. తనకు అనేకానేక ప్రశ్నలకు సమాధానం దొరికినట్టనిపించి కొత్త ధైర్యం పుడుతున్నది. ఆ ధైర్యంతోనే టైపిస్టు కుర్రాడితో పరిచయం పెంచుకున్నది.

ఇటీవలి సంగతులన్నీ శాంతితో చెప్పింది.

"అతను నాకంటే రెండేళ్ళ చిన్న వాడనుకుంటాను". అన్నది ఇంద్రాణి. భయం భయంగా. ధైర్యం భయం ధైర్యం భయం భయం ఆందోళన.

"ఏం ఫరవాలేదు. అతను నిన్ను పెళ్ళి చేసుకుంటాడా? పెళ్ళికి నువ్వు సిద్ధమేనా? మీ ఇద్దరూ ఒక అంగీకారాని కొస్తే ఎవ్వరూ ఒప్పుకోకపోయినా మీ పెళ్ళి జరిపించే ఏర్పాట్లు నేను చేస్తాను" అన్నది శాంతి. ఇంద్రాణికి చాలా భయంగా, కొంచెం ఆశగా వుంది. ఎక్కువ ఆందోళనగా వుంది. అంతా మొత్తంగా అయోమయంగా గందరగోళంగా వుంది.

అతని కోసం చూసింది. కనపడలేదు. ఓ రోజు కనపడ్డాడు.

'ఏదో నువ్వు ఇష్టపడ్డావని.... అన్నాడు.

'మా యింట్లో వొప్పుకోరేమో' అని నసిగాడు.

ఇదన్న మాట సంగతి. ఈ మగవాళ్లు ఇలా కూడా మాట్లాడగలరా? అయినా తను పెళ్ళి ప్రసక్తి తీసుకురాకుండానే ఇంత దూరమూ రానిచ్చింది కథని.... ఛి ఛీ..... తనదే తప్పా?

చివరికి 'నిన్ను పెళ్ళి చేసుకోవలసిన అవసరం నాకేమిటీ' అనేసి మొహం అదోలా పెట్టి గబగబా వెళ్ళిపోయేడు.

ఈ సంభాషణంతా శాంతితో చెప్పింది. అంతా విని దీర్ఘంగా నిట్టూర్చింది. 'ఇదంతా వేల సంవత్సరాలుగా జరుగుతున్న కథే. సరే. అయిందేదో అయింది. అధైర్య పడకు. గర్భస్రావం చేయించుకుంటావా? బిడ్డని కంటావా? జాగ్రత్తగా ఆలోచించి చెప్పు?" అన్నది, చాలా శాంతంగా.

ఇంద్రాణికి గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. ఎవరో తన గుండెల్లో పొగలు గక్కే ద్రావకం పోసి కాల్చుతున్నట్టనిపించింది.

శాంతి చాలా సేపు అన్ని సంగతులూ చెప్పింది. చాలా ధైర్యం చెప్పింది. ఇంద్రాణికి మూడు రోజులు రాత్రీ పగలూ కంటికి కునుకులేదు. ఎంత మానసిక సంఘర్షణ. ఎంత చిత్తక్షోభ. చివరికి బిడ్డను కనాలనే నిర్ణయించుకుంది.

తనకొక తోడు కావాలి. భర్తను పొందే అవకాశం ఎలాగూ లేదు. ఆ సంగతి తనకే అంతుపట్టడంలేదు. బిడ్డనయినా కని తనకొక సాయం నిలబెట్టుకోవాలి. పిల్లలకు అక్షరాలు నేర్పుతుంది. బట్టలు కుడుతుంది, ఎలాగో నాలుగు రూపాయలు సంపాదిస్తుంది. ఆ మాత్రం తనని తను పోషించుకుంటుంది. లోకం అంతా ఎదురు నిలిచినా తను తట్టుకుంటుంది.

శాంతితో భవిష్యత్కార్యక్రమం గురించి చర్చించింది. ఇంద్రాణి తనకి తనే కొత్తగా కనపడనారభించింది. ఇంత గట్టి నిర్ణయాలుతీసుకుంటున్నది తనేనా?

" ఎంతకు తెగించావే అలా చెప్పడానికి నీకు నోరెలా వచ్చిందే. మా పరువు గంగలో కలిపావు. ఈ ఇంటికి శనిలా దాపురించావు. పుట్టగానే చచ్చినా ఒక ఏడుపు ఏడిచి వూరుకుని వుందుము."

గోదావరమ్మ వంట గదిలోంచి పెద్దనోరు చేసుకొని అరుస్తోంది.

ఉదయం నుంచి అలాగే సాధిస్తోంది.

ఇంద్రాణి మధ్యాహ్నం భోజనం కూడా చెయ్యలేదు. కడుపులో తిప్పుతున్నట్టుంది. నీరసంగా వుంది. ఓపిక చేసుకొని, హితవు చేసుకొని తిందామన్నా తల్లితిట్లవల్ల మనసు మరింత వికలమె తినబుద్ధి కాలేదు.

' నన్ను ఆ దిక్కుమాలినకుట్టు సెంటర్ కు పంపడం వచ్చిందసలు' అనుకుంది.

' ఎవడేవాడు పెళ్ళాడతాడేమో కనుక్కో. వాడి మొహాన అయిదువేలో, పదివేలో పారేద్దాం. గుట్టు చప్పుడు కాకుండా గుళ్లో పెళ్లి జరిపించేద్దాం.'

' ఏ కులంతక్కువ వెధవో అయ్యుంటాడు. అయినా కుంటిదాన్ని చేసి ఇంత పని చేస్తాడా? నీకంటే అమాయకురాలు ఎవత్తీ దొరకలేదు గావున చచ్చినాడికి.'

'ఇదెక్కడగోలే నాతల్లి, ఏవెధవో చేసిన కడుపు వుంచుకుంటానంటావేమిటి ? ఇంతకీ వాడిదేకులం? వాడు నీకేదో మందు పెట్టేసి నీ మనసు మార్చేసి వుంటాడు.'

' తా దూర కంతలేదు. మెడకోడోలు అన్న చందంగా వుంది నీ సంగతి. నీ బతుక్కే ఓదారి లేదు. కన్నందుకు మేం ఏడవని రోజు లేదు. ఇహ రేపో మాపో కొడుకో కూతురో పుడితే ఏం దారి? నిన్ను భరిస్తున్నది చాలక ఆ దిక్కుమాలిన రొష్టుకూడా భరించాలా ?'

గొణుగుడు సాధింపు మధ్యమధ్య ఏడుపు ముక్కు చీదుడు ఉదయం నుంచీ ఇల్లంతా అగ్ని గుండంలా వుంది.

' రేపణ్ణించి ఇల్లు కదులు చెబుతాను '

ఇంద్రాణి కర్రవూతంతో కుంటుతూ నడుస్తుంది. తల్లి కోపంతో ఆకర్ర కాస్త విరిచేసి నీళ్ళ బాయిలర్ పొయ్యిలో పడేసింది. ఇంట్లో ఇంట్లో మసలడమే కష్టంగా వుంది. గోడలూ, తలుపులూ, ద్వారబంధాలు సాయం చేసుకొని నడుస్తోంది.

మర్నాటి సాయంత్రానికి రఘురాం ఎక్కణ్ణించో ఒక కర్ర పట్టుకొచ్చాడు . తమ్ముడి చేత కుట్టు సెంటరుకువచ్చే శాంతి గారికి ఇచ్చిరమ్మని రహస్యంగా చీటీ రాసి పంపించింది . శాంతి నుంచి సమాధానం తీసుకొచ్చాడు తమ్ముడు. చాలా పెద్ద వుత్తరం. అర్ధరాత్రి అందరూ పడుకున్నాక, లైటువేస్తే లేచిపోతారు గనుక, కర్ర చప్పుడు కాకుండా, కిటికీ వరకూ దేక్కుంటూ వెళ్ళి వీధి దీపంనుంచి వచ్చే వెలుగులో చదువుకుంది. ఆచరించే ధైర్యం వుండాలి మార్గం సిద్ధంగా వుంది. ఆచరించింది.

" అమ్మో అమ్మో కొంప ముంచిందే. ఈ కుంటి ముండ. ఎవడితోనో లేచి పోయింది. ఈచీటీ చూడండి. ఎంత పొడుగు రాసిందో. ఎంత తలవంపులు తెచ్చిందిది తల్లీ. దీన్ని కన్నందుకు ఏనుయ్యో గొయ్యో వెదుక్కోవాలి తప్ప మరో దారి కనబడ్డం లేదు. అమ్మో..... అమ్మో....."

"ష్.... ఎందుకలా ఏడుపూ కేకలూ. ఆ చీటీ అందుకో".

భార్య చేతిలోంచి అందుకున్నాడు. జోగారావు. అక్కడక్కడ అక్షరాలు తడిసి వున్నాయి.

'గౌ. అమ్మకీ, నాన్నకీనమస్కరించి వ్రాసేది'

నన్నుకని మీరు చాలా పెద్ద తప్పు చేశారు. నాకు మెల్ల, కుంటీ వున్నదనీ తెలిసి కూడా నన్ను ఇంత కాలమూ పెంచి పోషించి బహుశా ఇంకా పెద్ద తప్పే చేశారు.

నన్ను క్షమించండి. మీ భాషలో మీకు నేను తలవంపులు తెచ్చాను.

నాకు మెల్ల వుండొచ్చు. కుంటిదాన్ని కూడా కావచ్చు. కాని తక్కిన శరీర భాగాలన్నీ సవ్యంగానే వున్నాయి. వయసు క్రమ క్రమంగా ముందు కొస్తున్న కొద్దీ కోరికల ఒత్తిడికి తట్టుకోలేక తప్పు చేశాను. దోషినే నింద భరిస్తున్నాను. కాని... నేను మోసపోయాను. మోసపోయాక గాని ఈ ప్రపంచపు భయంకర స్వరూపం నాకు తెలిసిరాలేదు.

తప్పో, ఒప్పో తొందర పాటో, జరిగి పోయింది. లోకానికి జడిసి ఎబార్షన్ చేయించుకోవడం గాని, ఆత్మహత్య చేసుకోవడం గాని చెయ్యడం లేదు. శాంతి గారు నాకు మంచి స్నేహితురాలు. నన్ను మేల్కొలిపింది. నాకు ధైర్యం ఇచ్చి నిలబెట్టింది. కనుక నేను బిడ్డని కనదలుచుకున్నాను. నా బ్రతుక్కొక తోడుని నేనే ధైర్యంగా తయారు చేసుకుంటాను. అందుకే అంటున్నాను, నేను తల వంచుకునే పని చెయ్యడం లేదు. తలఎత్తి నిలబడుతున్నాను.

కొద్దిపాటి చదువుంది మీ దయవల్ల. కుట్టు పని నేర్చుకున్నాను. నలుగురు పసి పిల్లలకి పాఠాలు చెబుతాను. నాలుగు బట్టలు కుడతాను. నన్నూ నా బిడ్డనీ పోషించుకోగలనన్న నమ్మకం నాకుంది.

నా వంటి అవిటి వాళ్ళకు ఈ సమాజం ఏం చేసింది?

నా అనే తోడు కోసం అయినా నేను బిడ్డని కంటాను. పెళ్ళి కానిదే బిడ్డని కనడం ఆడదానిది మాత్రమే తప్పెందుకో తేల్చుకోవడం కోసం నేను తల్లినౌతాను. భర్త లేకుండా ఒక బిడ్డ తల్లిగా బ్రతకగల అవకాశం లేదా అని, ఈ సంఘాన్ని ఎదిరించి ప్రశ్నించడం కోసమే నేను నా జీవితం అంతా ఒక దీక్షలాగ, పోరాటంలాగా, నలుగురూ అర్థం చేసుకోదగిన పాఠంలాగా జీవిస్తాను.

కష్టమైనా, నష్టమైనా ఇరవై ఎనిమిది సంవత్సరాలు మీ మధ్య పెరిగాను. మిమ్మల్ని వొదిలి రావడం నాకూ చాలా కష్టంగానే వుంది. కాని తప్పదు. బిడ్డను కన్నాక తప్పక వుత్తరం రాస్తాను.

చెల్లెళ్ళనీ, తమ్ముణ్ణీ అడిగేనని చెప్పండి. ఈ అక్కని క్షమించమనీ, లేదా మర్చిపొమ్మనీ చెప్పండి. ఈ వుత్తరం మీరు చూసుకునే సరికి నేను రైల్లో ప్రయాణం చేస్తుంటాను.

ప్రస్తుతానికి సెలవు.

మీ పెద్దకూతురు
ఇంద్రాణి

ఉత్తరం ముగించే సరికి జోగారావుకి ఎవరో కడుపులో చెయ్యి పెట్టి దేవినట్టయింది. నీరసంగా కుర్చీలో చేతబడ్డాడు. ఈ నేరం తనదేనేమోననే ఆలోచన వచ్చి గిలగిలలాడిపోయేడు. తన కూతురు బ్రతుకు ఇలా కావడానికి తానూ ఒక కారకుడే. ఆ నేరంలోతనకు బహుశా చాలా పెద్ద భాగమే వుందేమో.

గోదావరమ్మ నెత్తి నోరూ కొట్టుకొని ఏడుస్తోంది.

పెద్దక్క ఎక్కడికి వెళ్ళిందో తెలిసిన రఘురాం, కళ్ళల్లో నీళ్ల ఆపుకోలేక, ఆమెకి ఎప్పుడు ఏడుపొచ్చినా కూచునే జామి చెట్టు కిందకి పరుగు తీశాడు, పెరట్లోకి.

సూర్యుడు అప్పుడే ఉదయించి క్రమంగా ఆకాశం మీదికి కాంతులు చిమ్ముతూ ఎగ బాకుతున్నాడు.

*రచన : 18-3-1989.*

*ప్రచురణ : ఆంధ్రజ్యోతి (ఆదివారం అనుబంధం) 7-7-91.*